క్లుప్తంగా

ఘనంగా ఫ్యామిలీ దినోత్సవం



రొద్దంలో ఫ్యామిలీ డే నిర్వహిస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఫ్యామిలీ దినోత్సవం నిర్వహించారు. టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా పొగ, మద్యం వల్ల అనర్థాలను తెలియజేశారు. కార్యక్రమంలో పెనుకొండ టీబీ సూపర్ వైజర్ శశిధర్, సీహెచ్ఓ శశికళ, పీహెచ్ఎన్ లక్ష్మినరసమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొరంపల్లిలో బోరుబావి ధ్వంసం



ధ్వంసం చేసిన బోరుబావిని చూపుతున్న రైతు గోపాల్

చిలమత్తూరు: మండల పరిధిలోని మొరంపల్లిలో రైతు గోపాల్‌కు చెందిన పొలంలోని వ్యవసాయ బోరుబావిని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కేసింగ్ పైపు కోసం బోరుబావిలోకి రాళ్లు వేసి ధ్వంసం చేసినట్లు రైతు గోపాల్ చెబుతున్నాడు. ఈ ఘటనపై శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దుండగులను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరాడు.

16న భూమి పూజ



మాట్లాడుతున్న జేకే మూర్తి

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న అంబేడ్కర్ స్మృతి వనం ఆవరణలో ఈ నెల 16న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు ఆ స్మృతి వనం కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ కార్యక్రమానికి మండలంలోని దళితులను ఆహ్వానిస్తామన్నారు. భూమి పూజ ఎలా చేయాలి? ఎవరిని ఆహ్వానించాలి? తదితర వాటిపై వారు చర్చించారు. కార్యక్రమంలో దళిత నాయకులు నారాయణ, జయకుమార్, తిప్పయ్య, జేకే మూర్తి, నాగరాజు, మల్లేష్, దేవరాజు, చెన్నప్ప, శివకుమార్, కెంచప్ప, తిమ్మప్ప, సిద్దేశ్వర తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరస్వామికి రేపు కుంభాభిషేకం

మడకశిర: పట్టణంలోని పావగడ రోడ్డులో వెలసిన చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం సహస్ర ఘటిక కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. వర్షాకాలం ప్రారంభమై దాదాపు రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ వర్షం పూర్తి స్థాయిలో కురవకపోవడంతో కుంభాభిషేకం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న హోం శాఖా మంత్రి డాక్టర్ పరమేశ్వర్

పావగడ: ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈ నెల 21న పావగడలో పర్యటిస్తారని, కార్యక్రమాన్ని విజయ వంతం చేయడానికి అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హోం శాఖా మంత్రి డాక్టర్ పరమేశ్వర్ సూచించారు. స్థానిక తాలూకా పంచాయతీ మీటింగ్ హాలులో శనివారం ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం ప్రారంభించే అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేడియం మైదానంలో ఏర్పాటు చేస్తున్న సీఎం సభాస్థలిని పరిశీలించారు. తొలుత స్థానిక శనీశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, కలెక్టర్ శుభ కళ్యాణ్, జెడ్పీ సీఈఓ జి.ప్రభు, ఎస్పీ అశోక్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర గౌడ, తహసీల్దార్ వరదరాజు, టీపీ ఈఓ జానకి రాం, మున్సిపల్ అధ్యక్షుడు సుదేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులూ తస్మాత్ జాగ్రత్త..

ఇటీవల స్థానిక రహమత్‌పురం సర్కిల్ టుటౌన్ సీఐ అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ దారులపై నిఘా పెట్టారు. 8 మందికి రూ.500 ప్రకారం జరిమానా విధించారు. అలాగే నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి సుమారు రూ.50 వేలు జరిమానా వసూలు చేశారు.

- నిబంధనలు ఉల్లంఘిస్తే భారీగా జరిమానా
- లైసెన్స్ లేకపోతే రూ.5 వేలు జరిమానా
- మైనర్లకు వాహనాలు ఇస్తే జైలుకే..
- మోటార్ వాహన చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్న పోలీసులు



హిందూపురంలో వాహనాదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

హిందూపురం: ద్విచక్ర వాహనాదారులు ఇకపై రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా తప్పదు. రహదారి నిబంధనలు కఠినంగా అమలు చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి. ఇక నుంచి న్యూ సెంట్రల్ మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం నిబంధనలు కఠినంగా ఉంటాయి. జరిమానా రూ.1000 నుంచి ప్రారంభం అవుతుంది. డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు వెనకాడరు. శ్రీసత్యసాయి జిల్లాలో ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు దాదాపు 42,270, ద్విచక్ర వాహనాలు సుమారు 1,94,500, కార్లు, జీపులు, ఇతర వాహనాలు 74,500 వరకు ఉన్నాయి. ఇటీవల మైనర్లు ద్విచక్ర వాహనాల్లో రైయ్ రైయ్ మంటూ దూసుకెళ్తున్నారు. పోలీసులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుంటడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. న్యూ సెంట్రల్ మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం నిబంధనలు కఠినంగా ఉంటాయి. ఇకనుంచి మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులకు శిక్షపడేలా చర్యలు తీసుకున్నారు. కొత్త చట్టం ప్రకారం మైనర్లు వాహనం నడిపితే రూ.25 వేలు జరిమానా విధించే అవకాశం లేకపోలేదు. అంతేగాక మూడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది.



నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ నిబంధనలను వాహనదారులు తప్పక పాటించాలి. ఇకపై కొత్త నిబంధనలను పక్కాగా అమలు చేస్తాం. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు కొంతమేరకు నివారించగలం. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరం. ప్రమాదాలు జరిగినప్పుడు కాకుండా ముందుగానే నియంత్రించడం మంచిది. పట్టణ ప్రధాన రహదారులు, జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి. మలుపులు, సర్కిళ్ల వద్ద నిర్లక్ష్యం మరొకరి ప్రాణాలను బలితీసుకుంటోంది. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులకు జైలు శిక్ష తప్పదు.

– మహేష్, డీఎస్పీ, హిందూపురం

జరిమానా ఇలా..

- లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేస్తే గతంలో రూ.500 జరిమానా ఉండేది. ఇప్పుడు దానిని రూ.5 వేలకు పెంచారు.
- మద్యం తాగి వాహనం నడిపితే గతంలో రూ.2 వేలు ఉండగా.. ఇప్పుడు రూ.10 వేలు జరిమానా వేస్తారు.
- రాంగ్ రూట్‌లో వాహనాన్ని నడిపితే రూ.5 వేలు జరిమానా విధిస్తారు.
- రెడ్‌సిగ్నల్ ఉల్లంఘించి వాహనాన్ని నడిపితే రూ.500 జరిమానా ఉంటుంది.
- అతివేగంగా వాహనాన్ని నడిపితే రూ.1,000 వసూలు చేస్తారు.
- అత్యవసర వాహనాలు అంబులెన్స్, ఫైర్ వాహనాలకు దారి ఇవ్వకుండా వెళ్తే రూ.10 వేలు జరిమానా ఉంటుంది
- రేసింగ్, స్పీడ్ డ్రైవ్ చేస్తే రూ.5 వేలు వసూలు చేస్తారు.
- హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం, సీట్ బెల్టు వేసుకోకుండా కార్లు నడిపితే రూ.వెయ్యి జరిమానా. అంతేగాక మూడు నెలలు లైసెన్స్ రద్దు చేసే అవకాశం లేకపోలేదు.
- ద్విచక్ర వాహనాల్లో ట్రిపుల్ రైడింగ్ చేస్తూ పట్టుబడితే రూ.2 వేలు చలానా రాస్తారు.
- ఇన్సూరెన్స్ లేకుండా వాహనాన్ని నడిపితే రూ.2 వేలు జరిమానా ఉంటుంది.

రామేశ్వరం యాత్రకు స్పెషల్ బస్సు ఏర్పాటు



బస్సును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ శ్రీకాంత్

హిందూపురం: హిందూపురం డిపో నుంచి రామేశ్వరం యాత్ర స్పెషల్ బస్సును శనివారం డిపో మేనేజర్ శ్రీకాంత్ జెండా ఊపి ప్రారంభించారు. కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, శ్రీరంగం, మధురై, రామేశ్వరం ఆరు పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు ఆర్టీసీ ద్వారా ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టిక్కెట్లు కావాల్సిన వారు 9440834715 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డిపో ఎస్‌టీఐ తిరుమలేష్ డిపో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న స్వామి జపానంద

పావగడ: స్థానిక రామకృష్ణ సేవాశ్రమాధిపతి స్వామి జపానందస్వామీజీ సుమారు 100 మంది ఆటో డ్రైవర్ల పిల్లలకు స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు శనివారం పంపిణీ చేశారు. ఏటాలాగే ఈ సారి కూడా జపానందస్వామీజీ విద్యా సామాగ్రి అందించడం ప్రశంసనీయమని ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు బేకరి నాగరాజు కొనియాడారు.

విడిపోయిన జంటలు ఒక్కటయ్యాయి..



దండలు మార్చుకుని ఒక్కటైన జంట

పావగడ: కుటుంబ కలహాలు, ఇతర సమస్యలతో విడాకుల కోసం కోర్టు మెట్లెక్కి అనేక సంవత్సరాలుగా దూరమై వేర్వేరుగా బతుకుతున్న దంపతులను చివరకు అదే కోర్టు కలిపింది. స్థానిక టీఎల్ఎస్‌సీలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో జుంజన్న కుమార్, లక్ష్మి, ప్రమోద్ కుమార్, వైష్ణి ఒకరినొకరు పూలదండలు మార్చుకుని ఒక్కటయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు, న్యాయవాదులు దూరమై దగ్గరైన జంటలకు శుభాకాంక్షలు తెలిపారు.

ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకాలు



టీకాలు వేస్తున్న డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం

హిందూపురం: ప్రస్తుత సీజన్‌లో పశువులకు వ్యాపించే ముద్ద చర్మ వ్యాధి నివారణ ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు బేవనహళ్లి పశు వైద్య సహాయకుడు డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం తెలిపారు. శనివారం బేవినహళ్లి పంచాయతీలో పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 31వ తేదీ వరకు పశువుల పాకల వద్దకు వెళ్లి టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఈ వ్యాధి కాలుష్యం, దోమలు, ఈగల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ముద్దచర్మ వ్యాధిని సమర్ధవంతంగా నిరోధించేందుకు టీకా వేయించడం అత్యవసరమని పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

హిందూపురం: స్థానిక ఎంజీఎం ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి బృందం, ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ కుమార్ రాజా, కార్యదర్శి ఉషా రాణి ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లకు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 540 మందికి వైద్య పరీక్షలు చేసి, 210 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఎంపికైన రోగులందరినీ బెంగళూరు శంకర కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయించి తిరిగి హిందూపురం తీసుకొస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు ధనుశ్రీ, అంజలి, వలంటీర్లు రహంతుల్లా, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను నట్టేట ముంచిన కూటమి నేతలు



రొద్దం కొత్తపల్లిలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రొద్దం: తప్పుడు హామీలతో చంద్రబాబు నమ్మించి నట్టేట ముంచాడని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. శనివారం మండలంలోని దొడగట్ట, రెడ్డిపల్లి తాడంగిపల్లి, ఎం. కొత్తపల్లి నారనాగేపల్లి తదితర గ్రామ పంచాయతీల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు మోసాను ప్రతి ఇంటికీ వెళ్లి వివరిస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమ్మ తిమ్మయ్య, మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు సి. నారాయణరెడ్డి, చిలకల రవి, వీరేష్, లక్ష్మీనారాయణరెడ్డి, ఆయా గ్రామాల స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం



చదివింపులు చేయిస్తున్న సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు: మతసామరస్యానికి ప్రతీక మొహర్రం అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. శనివారం హిందూపురం పట్టణంలోని 13వ వార్డు ఎస్.సడ్లపల్లిలో మొహర్రం వేడుకల్లో భాగంగా కొలువుదీర్చిన పీర్లను దర్శించుకున్నారు. పీర్లకు చదివింపులు చేయించారు. ఏళ్లుగా పీర్ల పండుగ చేయిస్తున్న గోపాల్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్‌లు శబరీష్ రెడ్డి, కురుబ శ్రీనాథ్, పట్టణ ఎక్జిక్యూటివ్ మెంబర్ హరగోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి, సంజీవప్ప, లక్ష్మన్న, సాయి, వెంకటేష్ రెడ్డి, అశ్వర్థరెడ్డి, అనిల్‌రెడ్డి, అబూబకర్, శీన, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



వ్రతం ఆచరిస్తున్న మహిళలు



అలంకరణలో వేంకటేశ్వరుడు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏడు శనివారాల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి మూలవిరాట్‌ను అర్చకుడు రాజేష్ వివిధ రకాల పూలు, తులసీ ఆకులు, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఏడు శనివారాల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చెన్నంశెట్టి జగదీష్, జింకా రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇకపై డ్రోన్‌తో నిఘా

గుడిబండ: బహిరంగంగా మద్యం, గంజాయి తాగడం, పేకాట, ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్ వంటి నేరాలపై మండల పోలీసుల యంత్రాంగం డ్రోన్ కెమెరాల సహాయంతో నిఘా ఏర్పాటు చేసింది. శనివారం గుడిబండ పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ గిరి, ఎస్ రాయాపురం, మండలపల్లి గ్రామాల్లో పరివాహక ప్రాంతాల్లో పాడుబడిన బంగ్లాలపై, నివాస గృహాలపై డ్రోన్ కెమెరాలతో పోలీసులు పలు చిత్రాలు తీసి అక్కడి పరిస్థితులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజకుల్లాయప్ప మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేకత కార్యకలాపాలకుపాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా వైసీ గోవర్ధన్‌రెడ్డి జన్మదినం

మడకశిరరూరల్: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు వైసీ గోవర్ధన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో వేడుకలు నిర్వహించారు. వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కమిటీల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేబుల్ చోరీ

కదిరి అర్బన్: మండల పరిధిలోని వీరేపల్లిపేట గ్రామంలో శుక్రవారం రాత్రి వ్యవసాయ పొలాల్లోని కేబుల్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు రైతులు గంగిరెడ్డి, రామాంజనేయులు తెలిపారు. చోరీపై కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి రూరల్ మండల పరిధిలోని ఏపీఐఐసీ పార్క్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం పెడపల్లి, వానవోలు, గోరంట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సకాలంలో స్పందించి ప్రాణం కాపాడిన పోలీసులు



ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దృశ్యం

రొద్దం: మండలంలోని ఆర్.లోచెర్లకు చెందిన మహేష్ అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా పోలీసులు సకాలంలో స్పందించి ప్రాణాలు రక్షించారు. ఎస్ఐ నరేంద్ర తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన మహేష్ దొడ్డబల్లాపూర్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం మహేష్ భార్యతో గొడవపడి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు గ్రామ మహిళా పోలీస్ కల్పనకు ఫోన్ ద్వారా తెలియజేశాడు. ఆమె బీదానిపల్లిలో పల్లె నిద్రలో ఉన్న డీఎస్పీ, ఎస్ఐలకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు ఫోన్ లొకేషన్ ద్వారా సోమందేపల్లి ఎస్ఐతో మాట్లాడి, అక్కడ కర్ణాటక పోలీసులకు సమాచారం ఇచ్చి, అతని ప్రాణాలు కాపాడి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి మహేష్ ప్రాణాలు కాపాడిన పోలీసులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

పెనుకొండ రూరల్: పట్టణంలోని బోయపేట, దర్గాపేట, కమాన్ వీధి, ఉప్పరవాడలో ఆదివారం ఉదయం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు హాజరుకావాలని పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహ, సుధాకర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా ఏకాదశి పూజలు



తమ్మదేపల్లిలో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు



రొళ్లలో లక్ష్మీనరసింహస్వామిని అలంకరించిన దృశ్యం



లక్ష్మీ నరసింహస్వామికి పూజలు

అమరాపురం: మండలంలోని తమ్మదేపల్లిలో మాల కులస్తుల ఆరాధ్య దైవం లక్ష్మీ నరసింహస్వామికి శనివారం ఏకాదశి పూజలను ఆ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి కలశాలు మోసుకుంటూ ఉరుములతో ఊరేగింపుగా గొడన కుంట ఉన్నత పాఠశాల ఎదురుగా వున్న స్వామి వారి మూల విరాట్ విగ్రహం వద్దకు వెళ్లారు. అక్కడ వివిధ రకాల పూజలు నిర్వహించి. భూత సేవలను చేశారు. అక్కడి నుంచి తిరిగి ఆలయం చేరుకుని, స్వామి వారికి వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనృరసింహస్వామి ఆలయంలో పూజలు

రొళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీనృరసింహస్వామి ఆలయాల్లో శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున మూల విగ్రహానికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, అష్టోత్త, విష్ణుసహస్రనామాలు తదితర పూజలు చేశారు. అనంతరం లక్ష్మీదేవి సమేతంగా నృరసింహస్వామి మూల విగ్రహాలకు పంచలోహ కవచాలతో పాటు భక్తులు కానుక రూపంలో తీసుకొచ్చిన పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం కట్టి వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి స్వామి వారికి మహామంగళారతి చేశారు. ప్రత్యేక పూజ రోజు కావడంతో భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో చేరుకుని విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

15న కలెక్టరేట్ వద్ద ధర్నా

కదిరి టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన పుట్టపర్తి కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు సంఘం అధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి ఆత్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కదిరి నియోజకవర్గ పరిధిలోని పెన్షనర్లు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లను తక్షణమే విడుదల చేయాలని కోరారు. 11వ పీఆర్‌సీలో నష్టపోయిన క్వాంటం ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ చేయాలన్నారు.

వ్యక్తిపై కట్టెతో దాడి

తనకల్లు: మండల పరిధిలోని టి.సదుం వద్ద ఇస్మాయిల్ అనే వ్యక్తి భాస్కర్‌పై కత్తితో దాడి చేశాడు. ఎస్ఐ గోపి తెలిపిన వివరాలు.. సున్నంపల్లి వాండ్లపల్లికి చెందిన భాస్కర్ తన స్నేహితులతో కలిసి ఈనెల 11వ తేదిన టి.సదుం గ్రామంలో జరుగుతున్న మొహర్రంకు వచ్చాడు. అయితే భాస్కర్ మూత్ర విసర్జన కోసం వెళ్లేటప్పుడు నల్లచెరువు మండలం దేవిరింటిపల్లికి చెందిన ఇస్మాయిల్ భుజానికి రాసుకుంటూ వెళ్లాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కోపంతో ఊగిపోయిన ఇస్మాయిల్ పక్కనే ఉన్న కట్టెతో దాడి చేయడంతో భాస్కర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు తీవ్రంగా గాయపడిన భాస్కర్‌ను చికిత్స కోసం బెంగుళూరుకు తరలించారు. భాస్కర్ తండ్రి పూజారి వెంకట చలపతి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.